RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్


దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 160 | మే 20, 2025 | వెల : రూ.3-00



అక్రమ మైనింగ్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

4లో..



## తనిఖీల జాడేది..?

- గ్రేటర్ పరిధిలో ప్రైవేటు ఆస్పత్రుల ఇష్టారాజ్యం
- పేరొకరిది.. వైద్యం మరొకరిది.. లైసెన్స్ లేకుండానే చలామణి
- ఫార్మసీ విభాగం కనీసం ఫార్మసిస్ట్ లేని వైనం.. అయినా నో యాక్షన్
- సంబంధిత శాఖ, మెడికల్ కౌన్సిల్ వారు చోద్యం చూస్తున్నట్టేనా?

**వేద న్యూస్, ఫోకస్ టీమ్:**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో సంబంధిత వైద్యారోగ్య శాఖ వారు, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వారు రెగ్యులర్‌గా తనిఖీలు నిర్వహించాల్సి ఉండగా, అసలు అలా దాడులు చేసినట్టు దాఖలాలు లేవని వరంగల్ నగరవాసులు పేర్కొంటున్నారు. ప్రైవేటు హాస్పిటల్స్ వారు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించేలా సంబంధిత శాఖ, సర్కారు ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టి.. తగు చర్యలు తీసుకోవాలని, అలా చేయకపోవడంతో సదరు ఆస్పత్రుల వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు చెబుతున్నారు. హనుమకొండలోని బంధన్ ఆస్పత్రి రోగుల మృత్యు ఒడిగా మారుతున్నా అధికారులు, ప్రభుత్వం కనీసంగా పట్టించుకోకపోవడంపై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంకెన్ని ప్రాణాలు పోతే స్పందిస్తారని అడుగుతున్నారు.

ప్రేవైటు ఆస్పత్రులు మల్టీ స్పెషాలిటీ బోర్డులు తగిలించుకుని.. వైద్యం పేరుతో చేస్తున్న దోపిడీలో సామాన్యులు నలిగి పోతున్నారు. అసలు ఒక వ్యక్తి వైద్యం అందించాలంటే ముందుగా అతడు జాతీయ మెడికల్ కౌన్సిల్ గుర్తించిన మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసి, తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. అప్పుడే అతడు వైద్యం చేసేందుకు అర్హుడు. దానితో పాటు ఆసుపత్రి నడపాలంటే జిల్లా వైద్యాధికారి అనుమతి ఉండాలి. క్లినిక్, ఆసుపత్రిల లైసెన్స్ విషయంలో జిల్లా వైద్యాధికారిదే నిర్ణయం. ఈ తరహా

మిగతా 4వ పేజీలో..





## అందరికీ ఆత్మగౌరవం

# కాంగ్రెస్ నినాదం

**దేశానికి స్వేచ్ఛను ఇచ్చిందే హస్తం పార్టీ ▪ 'ఇందిర సౌర గిరిజల వికాసం' ప్రోగ్రాం ప్రారంభంలో సీఎం రేవంత్**

**వేద న్యూస్, నాగర్ కర్నూల్ :**



స్వేచ్ఛను దేశానికిచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందరికీ భూములిచ్చి ఆత్మగౌరవం నింపాలన్నది కాంగ్రెస్ నినాదమన్న రేవంత్ రెడ్డి ప్రతి ఆదివాసి గుండెల్లో ఇందిరమ్మ ఉంటుందని వివరించారు. పాసు పుస్తకం చూసినప్పుడల్లా కాంగ్రెస్ గుర్తుకొస్తుందని అన్నారు. సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఇందిర సౌర గిరి జల వికాసం" పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అక్కడే స్ప్రింక్లర్ డ్రిప్‌ను స్విచ్ ఆన్ చేశారు. ఈ ప్రతిష్టాత్మక పథక ఉద్దేశాన్ని వివరిస్తూ రూపొందించిన కరపత్రాన్ని విడుదల చేశారు.

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, ధనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రణాళికా మండలి వైస్ చైర్మన్ జి. చిన్నారెడ్డి, సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ తో కలిసి ముఖ్యమంత్రి ఈ పథకాన్ని ప్రారంభించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ పహల్గాం ఘటన తర్వాత ప్రధాని అంటే ఇందిరాగాంధీలా ఉండాలనే చర్చ వచ్చిందని వ్యాఖ్యానించారు. ఆమె గతంలో పాకిస్థాన్‌తో యుద్ధం చేసి ఆ దేశాన్ని రెండు ముక్కలు చేశారని గుర్తుచేశారు. 50 ఏళ్ల తర్వాత కూడా ఇందిరాగాంధీ పేరు చెప్పుకొంటున్నారన్నారు. కేంద్రంలో ప్రతిపక్షం ఉన్నా మనల్ని(రాష్ట్ర ప్రభుత్వాన్ని) అభినందించాల్సిందేనని అన్నా రు. పన్నుల సేకరణలో కూడా తెలంగాణ ప్రథమ స్థానం లో ఉందని తెలిపారు. ఇప్పటి వరకు రైతులపై రూ.60 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. సన్నాలకు గిట్టుబా టు ధర కల్పించామని గుర్తుచేశారు. ప్రభుత్వం మద్దతుతో 1.56 కోట్ల మెట్రిక్ టన్నుల వరి పండించి చరిత్ర సృష్టించారని వివరించారు. వానా కాలంలో కూడా 1.35 కోట్ల మెట్రిక్ టన్నుల వరి పండించాలి అని రైతన్నలకు పిలుపునిచ్చారు. వరి పండించి గిట్టుబాటు ధర మాత్రమే కాకుండా రూ.500 బోనస్ కూడా పొందండి అని అన్నారు. ప్రతి పేదవాడికి సన్న బియ్యం ఇంటింటికి వస్తుంది అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో లోక్‌సభ సభ్యులు మల్లు రవి, బలరాం నాయక్, స్థానిక శాసనసభ్యులు చిక్కుడు వంశీకృష్ణతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



### త్రివేణి సంగమంలో పుణ్య స్నానం

## చేసిన కేంద్రమంత్రి

**వేద న్యూస్,శాయంపేట:**

కాలేశ్వరం త్రివేణి సంగమం వేద మంత్రోచరణ తో మారుమోగుతుంది. ఈ సందర్భంగా దక్షిణాది రాష్ట్రాల్లోనే ఏకైక క్షేత్రం అంతర్వాహినిగా ప్రవహిస్తున్న సరస్వతి సంగమం పుష్కరాలకు కాలేశ్వరం విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌ను జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిషిదర్ రెడ్డి,పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కర్ర సంజీవరెడ్డి, మంతిని నియోజకవర్గ ఇన్చార్జి చందుపట్ల సునీల్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కన్నం యుగంధర్, రాష్ట్ర నాయకులు చల్ల నారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేశారు. అనంతరం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కాలేశ్వరంలోని త్రివేణి సంగమంలో పుణ్యస్నానం ఆచరించి, ముక్తేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలి

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

**వేద న్యూస్, నర్సంపేట :**



రైతులు నష్ట పోకుండా ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. సోమవారం నర్సంపేట రైతు వేదికలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, జిల్లా కలెక్టర్ సత్య శారదతో కలసి అధికారులు, రైస్ మిల్లర్లతో నర్సంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్షించి సమర్ధ నిర్వహణకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ రబి కాలంలో నియోజకవర్గంలో 6 మండలాల్లో అధిక వరి దిగుబడి వచ్చిందని, ఇప్పటివరకు 40 శాతం ధాన్యం కొనుగోలు చేసారని అన్నారు. క్షేత్ర స్థాయిలో మండలాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి అధికారులు ధాన్యం నిలువ వివరాలు సేకరించి, దాని ప్రకారం ప్రణాళికాబద్ధంగా లారీలను, హమాలీలను ఏర్పాటు చేసుకొని వేగవంతంగా మిల్లులకు తరలించాలని అన్నారు. రైస్ మిల్లర్లకు సామర్థ్యాన్ని బట్టి వెంటనే కేటాయింపులు చేయాలని అధికారులను ఆదేశించారు.

కొంత మంది మిల్లర్లు కావాలని తరుగు పేరుతో రైతులను ఇబ్బందులు పెడుతున్నారని ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. ట్రక్ షీట్ ప్రకారమే తీసుకోవాలని కోతలు విధిస్తే ఉపేక్షించేది లేదని అన్నారు. 1638 రకం ధాన్యం ను గ్రేడ్ ఏ క్రింద పరిగణించి వాటిని తిరస్కరించకుండ తీసుకోవాలని అన్నారు. ఎక్కువ నూకలు వస్తున్నాయని బాయిల్డ్ రైస్ క్రింద తీసుకోనుటకు అనుమతించాలని మిల్లర్లు ఎమ్మెల్యేకు తెలుపగా, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకొంటామని ఎమ్మెల్యే అన్నారు. రైతులు పండించిన ప్రతీ గింజ ను ప్రభుత్వం కొనేందుకు సిద్ధంగా ఉందని, రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. అనంతర వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గంలో 1.07 మెట్రిక్ టన్నుల అంచనా ధాన్యం సేకరణ లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 31.54 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, కొనుగోలు చేసిన ధాన్యానికి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశామన్నారు. ఇంకను 70 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు వేగవంతంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఓపిఎం ఎస్ నమోదు వెంటనే చేయాలని, తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు పంపించాలని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిలువలను వెంటనే ఖాళీ చేసే ప్రయత్నం చేయాలన్నారు.

ఎట్టి పరిస్థితుల్లో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు పడకూడదని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే నిర్దేశిత మిల్లులకు తరలించాలని, మిల్లర్లు సహకరించాలని కలెక్టర్ అన్నారు. అవసరమగు లారీలు సమకూర్చాలని జిల్లా రవాణా అధికారిను కలెక్టర్ ఆదేశించారు. హమాలీల కొరత తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మిల్లుల వద్ద సకాలంలో అన్‌లోడింగ్ చేసుకునేలా పర్యవేక్షించాలన్నారు. తగినంత టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను సూచించారు. ఈ సమీక్షలో ఆదనవు కలెక్టర్ సంధ్యా రాణి, నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, డిఆర్డీఓ కౌసల్యాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా సహకార అధికారి నీరజ, జిల్లా పౌరసరఫరాల అధికారి కిష్టయ్య, జిల్లా మేనేజర్ సంధ్యా రాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, ఆర్డీఓ ఉమారాణి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ

## వేగవంతం చేయండి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వేద న్యూస్, దుగ్గొండి :**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. సోమవారం దుగ్గొండి మండలం లోని రేకంపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇందిరమ్మ ఇళ్ల పథకం క్రింద ఇండ్లు నిర్మించుకుంటున్న రంపిసా అశ్విని, రంపిసా కళావతిలతో మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. లబ్ధిదారుల ఖాతాలో బేస్మెంట్కు లక్ష, రూఫ్ లెవల్ బిల్లు మొత్తం 2 లక్షలు రూపాయలు జమ చేయడం జరిగిందని, నిర్మాణం పూర్తి కాగానే మిగతా రూ. 3 లక్షలు జమ చేస్తామని కలెక్టర్ అన్నారు. ఎటువంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వం నుండి నేరుగా లబ్ధిదారుల ఖాతాలో డబ్బులు జమ అయినందుకు లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, ఆర్డీవో ఉమారాణి, తహసీ ల్దార్, ఎంపిడిఓ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ముందుగానే 3 నెలల బియ్యం..!

- కసరత్తు చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం

వివరాలు 4లో..

## అస్తవ్యస్తంగా డ్రైనేజీ కాలువ

- దగ్గర ఉండి ప్రధాన డ్రైనేజ్ కాలువ పూడికను శుభ్రం చేయించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్



4లో..

వేద న్యూస్



# వైన్ షాపుల వద్ద మందుబాబుల వాగ్వాదాలు

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**

రాష్ట్రంలో ప్రభుత్వం మద్యం ధరలను పెంచిన నేపథ్యంలో మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట, మీర్ పేట, వైన్ షాప్ ల వద్ద వ్యాపారులకు వినియోగదారులకు మధ్య అనేక దుకాణాల ముందు వాగ్వాదాలు జరిగిన సంఘటనలు సోమవారం చోటుచేసుకున్నాయి. ఆదివారం రాత్రి ప్రభుత్వం మద్యం ధరలను క్వాటర్ కు పది రూపాయలు, హాఫ్ కు 20 రూపాయలు, ఫుల్ బాటిల్ కు 40 రూపాయల చొప్పున ధరలు పెంచుతూ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ధరల పెంపు వల్ల మద్యం ధరలు పెరగడంతో ఈ సమాచారం తమకు తెలియదు అని రాత్రి రాత్రికే ధరలు పెంచితే ఎలా అంటూ మందుబాబులు ప్రశ్నిస్తుంటే, ప్రభుత్వ పాలసీని అమలు చేయవలసిందేనని వ్యాపారస్తులు చెప్తున్న వైనం.

# ఆర్చకుడి పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**



బాసర దేవాలయ ప్రధానార్చకులు సంజీవ్ పూజారిపై ఆంధ్ర స్వాముల వారి అనుచరుడు నూకం రామారావు దాడి చేశాడని ఆరోపిస్తూ ఆలయ పూజారి పై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య తెలంగాణ పార్టీ ప్రధాన కార్యదర్శి వక్క లంక శ్రీనివాసరావు నేడొక ప్రకటనలో తెలిపారు. సంజీవ్ పూజారి కమ్మ సంఘం ఎదురుగా ఉన్న దారిలో వేద భారతి పీఠం ముందు వాకింగ్ చేస్తున్న నేపథ్యంలో వెనుక నుంచి వచ్చిన దుండగులు పూజారిని దుర్భాషలాడుతూ ముఖం పై పిడి గుద్దులు గుద్దుతూ దుర్భాషలు మాట్లాడారని స్థానికులు 100కు ఫోన్ చేయగా అది కలవకపోవడంతో దుండగుడు అక్కడి నుంచి పారిపోయాడని ఆరోపించారు. తక్షణమే దాడి చేసిన దుండగుడిని అరెస్టు చేసి తీవ్రంగా శిక్షించాలని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావు కోరారు.

## భారత సైన్యం పరాక్రమానికి

# ఆపరేషన్ సింధూర్ ప్రత్యక్ష సాక్షి

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**



భారత సైన్యం పరాక్రమానికి ఆపరేషన్ సింధూర్ ప్రత్యక్ష సాక్షి అని, ప్రముఖ న్యాయవాది, సామాజిక కార్యకర్త, బండి కనకదుర్గ అన్నారు. మృతి చెందిన సైనికులకు నివాళి అర్పించిన అనంతరం సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ భారత తన లక్ష్యాలను చాలా వరకు సాధించిందని వంద మంది ఉగ్రవాదులను మట్టు పెట్టిందని అన్నారు. ఆపరేషన్ సింధూర్ లక్ష్మణ రేఖ ఇంకొకసారి దాడి చేస్తే చొరబడి మరి అంతు చూస్తాం, పాకిస్తాన్ సరిహద్దును దగ్గరగా తాము నాశనం చేశామని పాకిస్తాన్ ప్రకటించుకున్న అదంపూర్ వేదికగా పాకిస్తాన్ కు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన హెచ్చరిక అని అన్నారు. భారత్ కొట్టిన దెబ్బకు పాకిస్తాన్ ఉనికికే సమస్య వచ్చిందని, అందుకే కాళ్లభేరానికి వస్తుందని దీనిని ప్రపంచమంతా చూసిందని, భారత సైన్యం పరాక్రమానికి ఈ ఈ సింధూర ఆపరేషన్ ఒక సాక్షి అని అన్నారు. భారత్ పాకిస్తాన్ మధ్య నాలుగు రోజుల పాటుసాగిన సాయుధ సంఘర్షణ పూర్తిస్థాయి యుద్ధంగా మారకముందే ముగియడం ఆనందకరం అని పేర్కొన్నారు. ఏ యుద్ధమైనా శాంతితోనే ముగియాలి, అని చరిత్ర చెబుతుంది ఇది కూడా అంతే యుద్ధం చేసే సైనికుడికే శాంతి విలువ తెలుస్తుంది. మంచి యుద్ధము చెడు శాంతి ప్రపంచంలో ఉండవు అని బండి కనకదుర్గ అన్నారు.

# మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించిన కురుపాం ఎమ్మెల్యే

**వేద న్యూస్, పార్వతీపురం మన్యం జిల్లా ప్రతినిధి :**



కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో గుమ్మల క్ష్మీపురంలో సోమవారం నాడు మజ్జిగ చలివేంద్రాన్ని ప్రభుత్వ విప్..కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రారంభించారు. వేసవి దృశ్య ఈ మజ్జిగ చలివేంద్రం ప్రయాణికులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్పర్సన్ కడ్రక కళావతి, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు, బిజెపి మండల కన్వీనర్ పెద్దింటి దివాకర్, నాయకులు వెంపటాపు భారతి, భూషణ్, దొరబాబు, అప్పలస్వామి, భాస్కర్ రావు, ప్రసాద్, గౌతమ్, రామారావు, రాజేష్, చిన్న, మన్మధ, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ ఇంటర్నేషనల్

# సిల్వర్ జూబ్లీ సంబురాలు




**వేద న్యూస్, కోదాడ :**

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా యాదగిరిగుట్టలోని ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రంలో ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఇరుకుల్ల రామకృష్ణ చేతుల మీదుగా పూర్వ వాసవి క్లబ్ కోదాడ అధ్యక్షులు అయిన బోనాల సైదారావు, చల్లా విజయ్ శేఖర్, చల్లా లక్ష్మీ నరసయ్య, ఇమ్మడి సతీష్ బాబు, వంగవీటి నాగరాజు లను శాలువాలు, మెమంటోలతో ఘనంగా సన్మానించటం జరిగిందిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ సెక్రటరీ గార్లపాటి శ్రీనివాసులు, ఇంటర్నేషనల్ ట్రెజరర్ సుజాత రమేష్, డిస్టిక్ 104 ఏ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి, ఐఇసి ఆఫీసర్లు వంగవీటి గురుమూర్తి, సింగిరికొండ రవీందర్, కేబినెట్ సెక్రటరీ బిక్కుమల్ల కృష్ణ, కోశాధికారి వెంపటి శబరీనాథ్, తదితరులు పాల్గొని సన్మాన గ్రహీతలకు కోదాడ వాసవి క్లబ్ అధ్యక్షులు సేకు శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.

# ఇండియాతో చర్చిస్తాం

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

అన్ని వివాదాలపై త్వరలోనే ఇండియాతో చర్చలు కొనసాగిస్తామని బంగ్లాదేశ్ మధ్యంతర ప్రభుత్వ అధినేత యూనిస్ ఖాన్ అన్నారు. ఇటీవల రెండు దేశాలు భూమార్గం ద్వారా జరిగే ఎగుమతులు, దిగుమతులపై ఆంక్షలు విధించుకున్నాయి. షేక్ హాసినా సర్కార్ పడిపోయిన తర్వాత యూనిస్ ఖాన్ ఆధ్వర్యంలో ఏర్పడిన మధ్యంతర ప్రభుత్వం.. భారత్ కు ప్రతికూలంగా వ్యవహరిస్తుంది. ఈక్రమంలో ఆదేశానికి భారత్ నుంచి భూమార్గాన జరిగే దిగుమతులపై అదనంగా 10శాతం పన్ను విధిస్తామని, కేవలం ఇండియా దిగుమతులు రేవుల ద్వారానే తమ దేశంలోకి రావాలని మెలికే పెట్టింది. దీంతో ఆగ్రహించిన భారత్..ఆదేశానికి ఇటీవల కౌంటర్ ఇచ్చింది.

# బీటీ రహదారి పనులకు శంకుస్థాపన

**వేద న్యూస్, పార్వతీపురం మన్యం జిల్లా ప్రతినిధి:**

నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి పక్క రహదారి సౌకర్యం కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్.. కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి అన్నారు. సోమవారం నాడు కురుపాం మండలంలో గుజ్జువాయి గ్రామం నుండి డేరింగ్ పాడు గ్రామం వరకు రూ. 2.8 కోట్లు నిధులతో మంజూరైన నూతన బీటీ రహదారి నిర్మాణ పనులకు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి భూమి పూజ చేసి, రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. రాష్ట్రంలో అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ



చైర్పర్సన్ కడ్రక కళావతి, మండల కన్వీనర్ కలిసేటి కొండయ్య, ఎంపీడీవో జె ఉమామహేశ్వరి, సర్పంచ్ నాగేశ్వరరావు, తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, నియోజకవర్గ మహిళా కార్యదర్శి వెంపటాపు భారతి, నాయకులు రంజిత్ కుమార్ నాయకో, సుబ్బలక్ష్మి, యువరాజ్, శంకర్, ప్రదీప్, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సీఎం ఇలాకలో దేవాలయ ప్రారంభోత్సవం



**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

ముఖ్యమంత్రి స్వగ్రామంలో హనుమాన్ దేవాలయ ప్రారంభోత్సవం జరిగింది. నాగర్ కర్నూల్ జిల్లా వంగూరు మండలం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్వగ్రామం కొండరెడ్డిపల్లిలో పర్యటనలో భాగంగా, తమ సొంత గ్రామంలో నూతన హనుమాన్ దేవాలయం ప్రారంభోత్సవం కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి తో కలిసి ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, నాగార్జునసాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ దేవుడి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరికీ ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఆహార పౌర శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, రోడ్డు మరియు భవనాల శాఖ, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పంచాయతీ రాజ్ మంత్రి సీతక్క, స్పీకర్ గడ్డం ప్రసాద్ లతోపాటు వివిధ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# రిషి మ్యూజికల్ ఈవెంట్స్ విజయ పరంపర కొనసాగించాలి

## – డాక్టర్ చింతలపూడి త్రినాధరావు

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**

నగరంలో ప్రతిష్టాత్మకమైన రిషి మ్యూజికల్ ఈవెంట్స్ తన విజయ పరంపరను ఇలాగే కొనసాగించాలని శారదా వరపుత్ర, స్వర కిన్నెర డాక్టర్ చింతలపూడి త్రినాధరావు అన్నారు. ఎందరో లబ్ద ప్రతిష్టులైన గాయకులే కాకుండా ఔత్సహిక గాయనీ గాయకులకు వేదికలు ఇస్తూ వారిని ప్రోత్సహిస్తున్న అక్కిరాజు యోగితా ప్రభంజన్ ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కోశి జొన్నవిత్తుల, వంశీ రామరాజు, ఆస్ట్రాలజీ చంటి పాల్గొని, గాయని గాయకులను, మిత్రమా నిర్వాహకులు యోగిత, అక్కిరాజు ప్రభంజ్ న్ లను ఆశీర్వదించారు.

### – అలరించిన సంగీత విభావరి

చిక్కడపల్లి గ్రామ సభ ప్రధాన వేదికగా జరిగిన రిషి మ్యూజికల్ ఈవెంట్ అతిప్రతిహతంగా కొనసాగింది. పద్మశ్రీ సిరివెన్నెల సీతారామశాస్త్రి జయంతిని పురస్కరించుకొని సిరివెన్నెల 80 సినీ గేయాలను 27 మంది ఔత్సాయిక కళాకారులు తమ గళాలతో వినిపించారు. ముందుగా కార్యక్రమంలో చంద్రిక శుక్లాంబరధరంతో ప్రారంభమై, కన్యాకుమారి కనబడదే దారి, అలా చూడు ప్రేమలోకం, ఏం మాయ చేసావో గాని ఉన్న మాట చెప్పలేను, మెరిసేటి జాబిలి నీవే కురిసేటి వెన్నెల నీవే, హృదయమనే కోవెలలో, నువ్వంటే నాకిష్టమని, కొత్త కొత్తగా ఉన్నది అంటూ, యోగిత, చంద్రిక, మోహన్ శేఖర్, అభిరామ్, చక్రి,జె పి, డాక్టర్ రమేష్,శ్రీనివాసరెడ్డి, సూర్య, హరిణి,కాక లబ్ద ప్రతిష్టులైన ఎందరో గాయని గాయకులు తమ గళాలు వినిపించారు.

# రాజ్యాంగమే సర్వోన్నతం : సిజెఐ జస్టిస్ గవాయ్

**వేద న్యూస్, డెస్క్:**

భారత రాజ్యాంగమే సర్వోన్నతమైందని, మూలస్తంభాలుగా ఉన్న వ్యవస్థలన్నీ కలిసి పనిచేయాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ తెలిపారు. మహారాష్ట్ర, గోవా బార్ కౌన్సిల్ ఏర్పాటుచేసిన సత్కార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఏకైక సర్వోన్నత శక్తి అని, న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, చట్టసభలు సమన్వయంతో రాజ్యాంగం ప్రకారమే పనిచేయాలని స్పష్టం చేశారు. దేశ ప్రాథమిక నిర్మాణం బలంగా ఉందని, రాజ్యాంగంలోని మూడు స్తంభాలు సమాన ప్రాధాన్యత కలిగి ఉండాలని, ఒకదాని పట్ల ఒకటి తగిన గౌరవాన్ని చూపాలని చెప్పారు. దేశం ఆర్థికంగా, సామాజికంగానే కాకుండా సాంస్కృతికంగానూ బలపడుతోందని, ఈ పురోగతిని కొనసాగించాలని అన్నారు. రాజ్యాంగంలోని అన్ని అంగాలు ఒకదానికి ఒకటి సహకరించుకోవడమే ప్రజాస్వామ్య సారాంశమని, ఇది భారత సమాఖ్యకు ప్రాథమిక ఆధారమని చెప్పారు. కోర్టు గౌరవాన్ని ఎవరైనా దెబ్బతీస్తే రాజీపడేది లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ గవాయ్ వెలువరించిన 50 ముఖ్యమైన తీర్పులను వివరించే పుస్తకాన్ని విడుదల చేశారు.

# సంపాదకీయం

## బహుప్రయోజితాలు.. తేనెటీగలు

భూమి మీద బతికే హక్కు మానవులకు ఎంత ఉందో, మిగతా జీవులకు కూడా అంతే ఉంది. మనిషి తన కోసమే జీవిస్తా డు. కానీ మిగతా జీవరాశులు అవి జీవిస్తూ సహచర ప్రాణులకు జీవనాధారంగా ఉపయోగపడుతున్నాయి. కొన్ని జీవులు ప్రత్యేకించి, తమ కోసం కాకుండా మానవులకు మిక్కిలి ఉపయోగార్థమే జీవిస్తాయి. అలాంటి వాటిల్లో ముఖ్యమైనవి తేనెటీగలు. వాటిని కాపాడు కోవాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. ప్రకృతి వరప్రసాదాల్లో తేనె ఒకటి. ఎలాంటి కల్తీకి లోనుకానిది, బలవర్ధక ఆహారం కూడా. స్వచ్ఛ మైన తేనె ఆరోగ్య ప్రదాయిని. తేనె వాడకం ఈ నాటిది కాదు. అనాది నుంచి కూడా వాడుకలో ఉంది. శిలాయుగం చివర్లోనే అడవి తేనె సేకరణ జరిగిందని చెప్పడానికి ఆధారాలున్నాయి. సుమారు పది వేల సంవత్సరాల మొదలు, యాభై వేల సంవత్సరాల ముందునుంచి తేనె మాధుర్యాన్ని చవి చూస్తూ ఉన్నారని చెప్పవచ్చు. స్పెయిన్‌లోని వలెన్సియా అనే ప్రాంతంలోని గుహలో అడవి తేనె వేటకు సంబంధించిన చిత్రాలున్నాయి. ఇవి 8 వేల సంవత్సరాల నాటివని చారిత్రకులు నిర్ధారించారు కూడా. తేనెలో కాల్షియం, రాగి, ఇనుము, మెగ్నీషియం, మాంగనీస్, భాస్వరం, పొటాషియం, జింక్, సల్ఫర్, సోడియం, సిలికాన్ వంటి ఖనిజ లవణాలు, థైమీన్, రిబోఫ్లావిన్, పైరిడాక్సిన్, పాంటోథెనిక్ యాసిడ్, నికోటెనిక్ యాసిడ్... లాంటి విటమిన్లూ పుప్పొడి ద్వారా చేరిన ప్రోటీన్లూ అమైనోఆమ్లాలూ ఎంజైములూ ఉంటాయి. తేనె సంపూర్ణ పోషక పదార్థమని, తిరుగులేని ఔషధ గుణాలు కలిగి ఉన్నదని తెలుసుకున్నాక దాని వాడకం అధికమైంది. తేనెలో నాలుగు రకాలు ఉన్నాయి - పట్టు తేనె, పుట్ట తేనె, కర్ర తేనె, తొర్ర తేనె. పట్టు తేనె ఈగలు పెద్దవిగా ఉండి, సాధారణంగా చెట్ల కొమ్మలకు, నగరాల్లో ఇళ్ళ పై కప్పులకు తెరలను నిర్మించుకుంటాయి. పుట్ట తేనె ఈగలు అడవుల్లో తమ తెరను గుహల్లోను, చీమల పుట్టల్లోనుబీ కర్ర తేనె ఈగలు చిన్నవిగా ఉండి చెట్ల కొమ్మలకు తమ చిన్న తెరను నిర్మించు కుంటాయి. తొర్ర తేనె ఈగలు అడవుల్లో చెట్ల తొర్రల్లో నిర్మించు కుంటాయి. పట్టు తేనె రుచికి కొద్ది వగరుగా ఉంటుంది. మిగిలిన మూడు రకాల తేనెలు తీపిగా ఉంటాయి. తేనె రకాల్లో పుట్ట తేనె శ్రేష్టమని చాలా మంది భావిస్తారు. 1934, మే 20న తేనెటీగల పెంపకంలో నిపుణుడైన అంథొన్ జంసా స్లొవేనియాలో జన్మించాడు. 2017, డిసెంబరులో ఐక్యరాజ్య సమితి సభ్య దేశాలు, మే 20ను ప్రపంచ తేనెటీగ రోజుగా గుర్తించాలన్న స్లొవేనియా ప్రతిపాదనను అమోదించాయి. మానవాళికి ఎంతో మేలు చేసున్న తేనెటీగలను కంటికి రెప్పలా కాపాడు కోవాలన్న ఉద్ధేశ్యంతో ఐక్యరాజ్య సమితి ఈ దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించింది. 2018, మే 20న తొలిసారిగా ప్రపంచ తేనెటీగ దినోత్సవం జరుపబడింది. జీవావరణ వ్యవస్థలో తేనెటీగలు, ఇతర పరాగరేణు సంపర్క కారకాల పాత్రను గుర్తించడమే ఈ రోజు యొక్క ఉద్దేశం. తేనెటీగలు ఆర్థికపరంగా మానవులకు సహాయ పడుతున్న ఉత్పాదక కీటకాలు. ఇవి పూల నుంచి మకరందాన్ని సేకరించి తేనెపట్టులో ఉంచి తేనెగా మారుస్తాయి. ఇవి సంతానోత్పత్తి కోసం తేనెపట్టును ఏర్పరచు కొంటాయి. తేనెటీగలు సాధారణంగా ఒక రాతికిగాని, భవనాలకు, చెట్టుకు తేనెపట్టును నిర్మిస్తాయి. ఒక్కొక్క తేనెతెట్టులో దాదాపు 50వేల తేనెటీగలు ఉండొచ్చు. ఒక్కొక్క తేనెపట్టులో మైనంతో చేసిన షడ్భుజాకారపు కక్ష్యలు అనేకం ఉంటాయి. రెండు రకాలుగా: 1. తేనెను, పుప్పొడి రేణువులను నిల్వ ఉంచేవి. 2. పిండ సంరక్షణకు ఉపయోగపడేవి. ఇవికాక రాణీ ఈగ కోసం పెద్ద కక్ష్య ఒకటి ఉంటుంది. తేనెటీగ ఆహారం దాచుకునే ఒక పద్దతే తేనె తయారయ్యే ప్రక్రియ. మొదట తేనెటీగల పువ్వుల నుంచి మకరందాన్ని తాగుతుంది. తర్వాత ఆ మకరందాన్ని తన తో పాటు తేనెసంచిలో మోసుకుని తీసుకు వస్తుంది. ఈ సంచి తేనెటీగల కడుపులో జీర్ణశయానికి వెలుపల ఉంటుంది. ముందుగా తేనెటీగ కడుపులో ఉన్నప్పుడే మకరందం తేనెగా మారుతుంది. మకరందంలో ఉండే చక్కెర పదార్థానికి రసాయనిక చర్య జరిగిన తర్వాత మధువులో ఉండే నీరు పూర్తిగా తీయ బడుతుంది. తేనెతుట్టెకు ఉన్న ద్వారాల వేడి లోపలికి ప్రవేశించడంతో ఈ నీరు పూర్తిగా అవిరైపోతుంది. దీని వల్ల తేనె చాలా కాలం నిల్వ ఉంటుంది. తేనెటీగ తేనెతుట్టెలో మకరందాన్ని తేనెగా మార్చుకుని దాచు కుంటుంది. ఒక్కోసారి తేనెటీగలకు పువ్వుల మకరందం లభించి నప్పుడు రకరకాల పురుగుల నుంచి చెట్ల నుంచి తియ్యటి ద్రవాలను సేకరిస్తుంటాయి. ఒక్క తేనెతుట్టె ఏర్పడడానికి కొన్నివందల తేనెటీగలు వేలసార్లు అటు ఇటు తిరుగు తుంటాయి. ఆహారం కోసం తేనెటీగలు ఎంతో కష్టపడు తుంటాయి. తేనెతుట్టె లోంచి తేనెను తీయడానికి రకరకాల పద్దతులను అనుసరి స్తుంటారు. తేనె పూర్తిగా పువ్వులపై ఆధారపడి ఉంటుంది. పువ్వులు ఎక్కువగా పూసేచోటే తేనె తుట్టెలు కనిపిస్తుంటాయి. తేనెకు మన ఆహార పదార్థాలలో ప్రాధాన్యత ఎంతో ఉంది. తేనెలో విటమిన్‌లు, ఎంజైమ్‌లు, ప్రోటీన్స్, ఆసిడ్, చక్కెర మొదలైనవి ఉన్నాయి. మకరందాన్ని బట్టి తేనె రంగు ఆధారపడి ఉంటుంది.పరాగ సంపర్క ప్రక్రియ మనం తినే పండ్లు, కూరగాయలు లేదా ధాన్యాలకు దోహదం చేస్తుంది. చెట్ల మొక్కల పుప్పొడి కణాలను ఒక మొక్క నుండి మరొక మొక్కకు రవాణా చేయడానికి తేనెటీగలు సహాయ పడతాయి. ఒక తేనెటీగ ఒకే పువ్వు మీద కూర్చున్నప్పుడు, పుప్పొడి కణాలు దాని పాదాలకు, రెక్కలకు అంటు కుంటాయి. అది మరొక మొక్కకు ఎగిరినప్పుడు, పుప్పొడి కణాలు ఆ మొక్కలోకి వెళ్లి దానిని సారవంతం చేస్తాయి, దీనివల్ల పండ్లు మరియు విత్తనాలు ఏర్పడతాయి. తేనెటీగలు వ్యవసాయానికి కూడా ఇతోధిక సహకారం అందిస్తు న్నాయి. ప్రపంచ వ్యవసాయంలో 70 శాతం కీటకాలు - పురుగులపై ఆధారపడి ఉన్నాయి. తేనెటీగ ఎలాంటి వ్యాధికారక బాక్టీరియా లేదా వైరస్ ను వదలదు. నేడు తేనెటీగల లాంటి చిరు కీటకాలు వివిధ కారణాల వల్ల ప్రాణాలు విడుస్తున్నాయి. రసాయనాల వాడకం, కాలుష్యం, ముఖ్యంగా నెట్వర్క్ ల లాంటి మరెన్నో కారణాలతో మానవుని విపత్కర వింత చర్యలకు బలి అవు తున్నాయి. క్రమేపీ కనుమరుగై పోతున్నాయి.... మనం తినే వంద రకాల ఆహార పదార్థాల్లో సుమారు డెబ్బైపదార్థాలు కేవలం తేనెటీగల వల్ల కలిగే మొక్కల పరాగ సంపర్కం వల్లే ఉత్పత్తి అవుతున్నాయి.

# జ్యోతి మల్హోత్రా విచారణలో విస్తుపోయే నిజాలు

**- పాక్‌కు గూఢచర్యం: యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా అరెస్ట్ - విచారణలో పశ్చాత్తాపం లేదన్న జ్యోతి!**

**వేద న్యూస్, డెస్క్:**

హర్యానాకు చెందిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా పాకిస్థాన్‌కు గూఢచర్యం చేసిందన్న ఆరోపణలపై అరెస్టయిన విషయం విదితమే. ఈ కేసుకు సంబంధించి పోలీసుల విచారణలో పలు కీలకమైన, ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. విచారణ సమయంలో జ్యోతి ముఖంలో ఎలాంటి పశ్చాత్తాపం గానీ, తాను చేసిన తప్పునకు బాధపడుతున్న ఛాయలు గానీ కనిపించలేదని సంబంధిత వర్గాలు తెలిపినట్లు 'ఇండియాటుడే' ప్రచురించిన కథనం పేర్కొంది. అంతేకాకుండా, తాను కేవలం తన వాక్ స్వాతంత్ర్యాన్ని మాత్రమే వినియోగించుకుంటున్నానని ఆమె దర్యాప్తు అధికారులతో చెప్పినట్లు సమాచారం. పాకిస్థాన్‌కు అనుకూలంగా ప్రచారం విస్తృతంగా వ్యాప్తి చేయాలని జ్యోతి మల్హోత్రాకు స్పష్టమైన ఆదేశాలు వచ్చాయని, ఇది ఒక సరికొత్త తరహా యుద్ధమని కూడా దర్యాప్తు వర్గాలు తెలిపాయి.

ఇటీవల పహల్గామ్ ఉగ్రదాడి జరిగిన తర్వాత, జ్యోతి తన యూట్యూబ్ ఛానెల్‌లో ఒక వీడియోను పోస్ట్ చేసింది. ఆ దాడి ఘటనకు ఏ ఒక్క పాకిస్థాన్ పౌరుడు కూడా బాధ్యుడు కాదని ఆమె అందులో పేర్కొన్నట్లు సమాచారం. జ్యోతితో సన్నిహితంగా ఉన్న కొందరు పాకిస్థానీయులు ఆమెకు మరికొన్ని అదనపు పనులు కూడా అప్పగించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కోణంలో కూడా అధికారులు విచారణ ముమ్మరం చేశారు. గతవారం హర్యానా పోలీసులు జ్యోతి మల్హోత్రాను గూఢచర్యం ఆరోపణల కింద అరెస్టు చేశారు. అప్పటినుంచి ఆమె గురించి అనేక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పహల్గామ్ దాడి జరగడానికి ముందు ఆమె పలుమార్లు పాకిస్థాన్‌లో పర్యటించినట్లు, ఒకసారి చైనాకు కూడా వెళ్లి వచ్చినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ముఖ్యంగా, 'ఆపరేషన్ సిందూర్' అనంతరం సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో, జ్యోతి ఢిల్లీలోని పాకిస్థాన్ రాయబార కార్యాలయంలో పనిచేస్తున్న డానిష్ అనే అధికారితో నిరంతరం టచ్‌లో ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. డానిష్ ఆమెను ఉద్దేశపూర్వకంగా ట్రాప్ చేసి, తమ కార్యకలాపాలకు వాడుకున్నట్లు గుర్తించారు. పహల్గామ్ ఘటన జరగడానికి కొద్ది రోజుల ముందు జ్యోతి ఆ ప్రాంతానికి వెళ్లిందని, అక్కడ



పలు వీడియోలు చిత్రీకరించిందని కూడా పోలీసులకు సమాచారం అందింది. ఈ సమాచారాన్ని ఆమె పాకిస్థాన్ ఏజెంట్లకు చేరవేసి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ అంశంపై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ట్రావెల్ బ్లాగర్‌గా, యూట్యూబర్‌గా పేరున్న జ్యోతి మల్హోత్రా 'ట్రావెల్ విత్ జో' అనే పేరుతో ఒక యూట్యూబ్ ఛానెల్‌ను నిర్వహిస్తోంది. ఇప్పటికే ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను కూడా భారత్‌లో అధికారులు నిలిపివేశారు.

# ఇస్రో కీలక శాటిలైట్ పరీక్ష విఫలం

**వేద న్యూస్, డెస్క్:**



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రతిష్టాత్మక పిఎస్ఎల్‌వి ప్రయోగం ఆదివారం విఫలం అయింది. శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి అత్యంత విశ్వసనీయ పిఎస్ఎల్‌వి వాహకనౌక నుంచి భూ పర్యవేక్షక ఉపగ్రహ పరీక్ష జరిపి, ఈ శాటిలైట్‌ను నిర్ణీత కక్షలోకి పంపించాలని నిర్ణయించారు. అయితే ప్రయోగం తరువాత కొద్ది నిమిషాలకే పిఎస్ఎల్‌వి సాంకేతిక లోపాలతో కదలకుండా మొరాయించింది. దీనితో ఈ ప్రయోగం విఫలం అయినట్లు ఇస్రో గుర్తించింది. ఈ స్పేస్‌పోర్టు నుంచి ఇస్రోకు ఇది 101వ మిషన్. పిఎస్ఎల్‌వి సి 61 వాహక నౌక నిర్ణీత కాలం ప్రకారం తెల్లవారుజామున 5:59 నిమిషాలకు తన లక్ష్యాన్ని పూర్తి చేయాల్సి ఉంది. అయితే మిషన్‌లో సరిగ్గా 12వ నమిషంలో రాకెట్‌లో లోపం తలెత్తినట్లు నిర్ధారణ అయింది. ఆదివారం విఫలమైన యాత్ర గురించి ఇస్రో ఛైర్మన్ వి నారాయణన్ మీడియాకు ఆ తరువాత తెలిపారు. ఇది తమ సంస్థకు 101వ మిషన్. శ్రీహరికోట నుంచి దీనిని తలపెట్టాం. పిఎస్ఎల్‌వి నాలుగంచెల వాహక నౌక , ప్రయోగపు రెండో దశ వరకూ అంతా సవ్యంగా సాగింది. అయితే మూడో స్టేజ్ కూడా బాగానే ఆరంభం అయింది. అయితే తరువాతి క్రమంలో లోపాలతో పిఎస్ఎల్‌వి మొండికేసిందని, నిర్ణీత లక్ష్యం నెరవేరలేదని ఆయన వైఫల్యాన్ని అంగీకరించారు. మోటారు సంబంధిత సంచాలక వ్యవస్థలో తలెత్తిన ఛాంబర్ ప్రెషర్ లో లోపం పిఎస్ఎల్‌వి వైఫల్యానికి దారితీసిందని ఆయన వివరించారు. ఇప్పుడు తమ సాంకేతిక బృందం రంగంలోకి దిగింది. ఎందుకు ఈ యాంత్రిక లోపం తలెత్తిందనేది ఆరా తీస్తోందని , త్వరలోనే అని విషయాలు తెలియచేయడం జరుగుతుందని వివరించారు. విఫల ప్రయోగానంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.

# ఇజ్రాయెల్ దాడిలో 103 మంది బలి

**వేద న్యూస్, డెస్క్:**

దీర్ఘకాలిక దాడుల పీడిత గాజా స్ట్రిప్ మరోసారి ఇజ్రాయెల్ భీకర దాడులతో తల్లడిల్లింది. ఆదివారం తెల్లవారుజామున ఇజ్రాయెల్ సేనలు తమ సుదీర్ఘకాలపు టార్గెట్ ఖాన్‌యూనిస్‌పై జరిపిన దాడులలో కనీసం 103 మంది వరకూ దుర్మరణం చెందారు.పలు ఆసుపత్రులకు క్షతగాత్రులు రావడం, చికిత్స పొందుతూ వీరిలో కొందరు మృతి చెందడం జరిగిందని స్థానిక అధికారులు తెలిపారు. దాడుల క్రమంలో తమ టార్గెట్లు ఏమిటనేది కూడా గుర్తించనంత విచక్షణారహితంగా ఇజ్రాయెల్ ఇటీవలి కాలంలో వరుసగా వైమానిక ఇతరత్రా దాడులకు దిగుతోంది. ఈ క్రమంలో సాధారణ పౌరులు బాధితులు అవుతున్నారు. ప్రత్యేకించి ఉత్తర గాజాలో ఆదివారం పలు ప్రాంతాలు గాయాలతో తల్లడిల్లుతూ , సరైన చికిత్స లేకుండా రోదిస్తూ ఉన్న పౌరులు, అనేక ప్రాంతాలలో భౌతిక కాయాలు దిక్కులేకుండా పడి ఉన్నాయి. దీనితో ఈ అమానుష యుద్ధ పరిస్థితి నుంచి తమకు విముక్తి ఎప్పుడని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ తెల్లవారుజామునే జబాలియా శరణార్థ శిబిరంపై దాడుల తరువాత భయానక పరిస్థితి ఏర్పడింది. అనేక మంది దాడులలో మృతి చెందారు. ఆకలి దప్పులు తీర్చుకోవడానికి, తలదాచుకోవడానికి ఇక్కడికి వస్తే తమకు ఇక్కడ కూడా దిక్కులేని స్థితి ఏర్పడిందని బాధితులు వాపోతున్నారు. తమతో పాటు తలదాచుకున్న వారి తలలు తెగిపడ్డాయి. మా కాళ్లు చేతులు విరిగి పడ్డామని ఓ ముసలి వ్యక్తి తెలిపారు. ఇప్పట్లో తమ బాధల నుంచి ఎప్పటికైనా విముక్తి దక్కుతుందా ? అనేది తమను కలిచివేస్తున్న ప్రశ్న అని చెప్పారు. తమకు బతుకు అనేది తాత్కాలికం అయ్యి, చావు ఎప్పుడు అయినా తరుముకుని వచ్చి , కబళించుకు వెళ్లే తంతు అయిందని తన పిల్లలు మృతి చెందగా బాధను దిగమింగుతూ ఓ నడివయస్సు మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ ప్రాంతంలో ఇప్పటికీ తలదాచుకుంటూ వస్తున్న హమాస్ తీవ్రవాదుల పూర్తి ఏరివేత తమ టార్గెట్ అని ఇజ్రాయెల్ స్పందించింది. ఈ దాడులలో పౌరుల మృతి గురించి స్పందించలేదు. కాగా ఇజ్రాయెల్ ఇప్పుడు తమ ఆయుధ పొదిలోని అత్యంత శక్తివంతమైన సరికొత్త గిడియన్స్ ఛారియట్స్‌ను దాడికి వాడిందని వెల్లడైంది. ఈ ప్రత్యేక ఆయుధ వ్యవస్థ లక్షణాలు ఇతరత్రా వివరాలను ఇజ్రాయెలీలు వెల్లడించలేదు. ఇక ముందు తెలిసివస్తుందని ఓ సైనికాధికారి వ్యాఖ్యానించారు.

# జో బైడెన్‌కు క్యాన్సర్

**వేద న్యూస్, డెస్క్:**

అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌కు ప్రోస్టేట్ క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయిందని ఆయన కార్యాలయం ఆదివారం తెలిపింది. మూత్ర సంబంధిత లక్షణాలు, ప్రోస్టేట్ నాడ్యూల్ కనిపించిన తర్వాత బైడెన్‌ను గత వారం వైద్యులు చూశారు. శుక్రవారం ఆయనకు ప్రోస్టేట్ క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. ప్రోస్టేట్ క్యాన్సర్‌లకు గ్లీసన్ స్కోర్ అని పిలువబడే స్కోర్ ఇవ్వబడుతుంది. ఇది సాధారణ కణాలతో పోలిస్తే క్యాన్సర్ కణాలు ఎలా కనిపిస్తాయో 1 నుండి 10 స్కేల్‌లో కొలుస్తుంది. బైడెన్ కు ఈ స్కోరు 9 అని, క్యాన్సర్ విస్తృతంగా వ్యాప్తి చెందుతుందని ఆయన కార్యాలయం పేర్కొంది. ప్రోస్టేట్ క్యాన్సర్ శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపించినప్పుడు, అది తరచుగా ఎముకలకు



వ్యాపిస్తుంది. స్థానికీకరించిన క్యాన్సర్ కంటే మెటాస్టాసైజ్డ్ క్యాన్సర్ చికిత్స చాలా కష్టం ఎందుకంటే మందులు అన్ని కణితులను చేరుకోవడం, వ్యాధిని పూర్తిగా తొలగించడం కష్టంగా ఉంటుంది.

# న్యూయార్క్‌లో నౌకా ప్రమాదం

**వేద న్యూస్, డెస్క్:**

అమెరికాలో మరోసారి ఘోరమైన నౌకా ప్రమాదం జరిగింది. ప్రపంచవ్యాప్త సృహద్భావ యాత్రకు బయలుదేరిన మెక్సికన్ నౌక న్యూయార్క్‌లోని బ్లూక్లిన్ బ్రిడ్జి ని ఎత్తు కావడంతో బలంగా తగిలింది. నగరంలో మధ్య నుంచి ప్రవహించే ఈస్ట్ నది పై ఈ వంతెన ఉంది.ప్రమాద ఘటనతో తీవ్రంగా గాయపడ్డ నలుగురిలో నౌకా యాన సిబ్బందిలోని ఇద్దరు మృతిచెందారు. ఇక నౌక ప్రాచీనమైన వంతెన పైకప్పుకు తగిలి గాలిలో వేలాడిన స్థితిలో ఉంది. దీనితో ఇందులోని జనం గావుకేకలు పెట్టారు. తరువాత స్థానిక సహాయ బృందం వచ్చి రక్షించింది. న్యూయార్క్ నగర మేయర్ ఎరిక్ అడమ్స్ ఘటన గురించి తెలిపారు. 142 ఏండ్ల క్రితం కట్టిన ఈ బ్రిడ్జి ఇప్పుడు నౌకా తాకిడితో పెద్దగా ముప్పు లేకుండా నిలబడిందని అయితే ఇద్దరు మృతి చెందారని, 19 మందిని చికిత్సలకు తరలించారని వెల్లడించారు. చాలా ఎత్తుగా ఉండే ఈ నౌకలో ఘటన దశలో 277 మంది ఉన్నారు. కాగా మొదటి రెండు అంతస్తులు బ్రిడ్జికి తగిలి పాడయ్యాయి. ప్రమాదం ఏ విధంగా జరిగిందీ? కారణాలు ఏమిటనేది తెలియాల్సి ఉందని మేయర్ చెప్పారు. నౌక బ్రిడ్జిని ఢీకొనడం, కొంత భాగం గాలిలో తేలియాడుతూ ఉన్న దృశ్యాలు స్థానిక సామాజిక మాధ్యమాల్లో వెల్లువెత్తాయి. బ్రూక్లిన్ ప్రాంతంలోని ఈ బ్రిడ్జి వద్ద నౌక అతి వేగంగా వెళ్లడంతోనే ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఘటన తరువాత ఇక్కడ జలమార్గంలోనూ , రోడ్లపై కూడా చాలా సేపటి వరకూ ట్రాఫిక్ స్తంభించింది. నౌకలో తలెత్తిన సాంకేతిక లోపాలతోనే ఇది ఆగకుండా ముందుకు సాగి బ్రిడ్జికి తట్టుకుని నిలిచిందని అధికారులు తొలి దశలో నిర్ధారించారు.

# భారత్ ఏమైనా ధర్మసత్రమా?

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

"ప్రపంచంలోని శరణార్థులందరికీ ఆశ్రయం కల్పించడానికి భారతదేశం ఏమీ ధర్మసత్రం కాదు. ఇప్పటికే 140 కోట్ల జనాభాతో మేం ఇబ్బందులు పడుతున్నాం. విదేశీ పౌరులందరినీ చేర్చుకోవడానికి ఇది ధర్మశాల కాదు," అంటూ సుప్రీంకోర్టు ఓ శ్రీలంక జాతీయుడిపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. తనకు ఆశ్రయం కల్పించాలంటూ సదరు వ్యక్తి పెట్టుకున్న పిటిషన్‌ను శుక్రవారం కొట్టివేసింది. ఈ దేశంలో స్థిర నివాసం కల్పించాలనే హక్కు మీకెక్కడిదని ఘాటుగా ప్రశ్నించింది. జస్టిస్ దిపాంకర్ దత్తా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. శ్రీలంకలో ఒకప్పుడు క్రియాశీలంగా ఉన్న లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం (ఎల్‌టీటీఈ) ఉగ్రవాద సంస్థతో సంబంధాలున్నాయన్న ఆరోపణలపై 2015లో సదరు శ్రీలంక జాతీయుడిని భారత్ లో అరెస్టు చేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం కింద 2018లో ట్రయల్ కోర్టు అతడిని దోషిగా నిర్ధారించి, పదేళ్ల జైలు శిక్ష విధించింది. అయితే, 2022లో మద్రాస్ హైకోర్టు ఈ శిక్షను ఏడేళ్లకు తగ్గించింది. శిక్షాకాలం పూర్తయ్యాక దేశం విడిచి వెళ్లాలని, అప్పటివరకు శరణార్థుల శిబిరంలో ఉండాలని ఆదేశించింది. దీంతో, సదరు శ్రీలంక తమిళ జాతీయుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. తాను వీసాపైనే భారత్‌కు వచ్చానని, స్వదేశంలో తనకు ప్రాణహాని ఉందని, తన భార్యాపిల్లలు ఇక్కడే స్థిరపడ్డారని తన పిటిషన్‌లో పేర్కొన్నాడు. శిక్ష పూర్తయి దాదాపు మూడేళ్లు కావస్తున్నా తనను ఇంకా నిర్బంధంలోనే ఉంచారని, దేశం నుంచి పంపించే ప్రక్రియ కూడా ప్రారంభించలేదని వాపోయాడు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 (జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛకు రక్షణ), ఆర్టికల్ 19 (ప్రాథమిక హక్కులు - వాక్ స్వాతంత్ర్యం, సంచార స్వేచ్ఛ వంటివి) కింద తమకు హక్కులున్నాయని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు.

వేద న్యూస్
మంగళవారం మే 20, 2025

## ఓబీసీల బలోపేతానికి కృషి చేస్తా..

■ తురాయి రజిని నియామకం



**వేద న్యూస్, హన్మకొండ :**

నేషనల్ ఓబీసీ హన్మకొండ, వరంగల్ అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్చార్జిగా వరంగల్ బ్యాంక్ కాలనీకి చెందిన తురాయి రజినిని నియమిస్తూ ఓబిసి నేషనల్ కమిటీ చైర్ పర్సన్ భాగ్యలక్ష్మి, నేషనల్ ఓబీసీ కమిటీ వైస్ చైర్పర్సన్ శ్రీనివాసచారి సోమవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి ఓబీసీ ఇన్చార్జిగా నియమించడం పట్ల తురాయి రజిని వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. హన్మకొండ,వరంగల్ నియోజకవర్గం ఓబిసి ల బలోపేతానికి కృషి చేస్తూ తాను నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన ఓబీసీ కమిటీ పెద్దలకు, నియోజకవర్గ ఓబిసి బంధుమిత్రులకు రజనీ కృతజ్ఞతలు తెలియజేశారు.

## వైష్ణవి చారిటబుల్ ట్రస్ట్ అధినేత సునీల్ కన్నుమూత



**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**

వైష్ణవి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంతోమంది పేద విద్యార్థులకు విద్యాదానం చేసిన నిగర్వి మంత్రి సునీల్ (55) ఆదివారం తెల్లవారుజా మున1. 30 నిమిషాలకు గుండెపోటుతో మృతి చెందారు. మంత్రి సునీల్ పార్థివ దేహానికి తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు పోచంపల్లి రమణారావు, దేవులపల్లి రంగారావు, దేవులపల్లి అశోక్ కుమార్, గూడా జయరాం, గూడా రాజేశ్వరరావు, నర్వ రఘు, చెన్నూరి లక్ష్మీనరసింహారావు (అన్వేషి), కానాల శ్యాంసుందర్రావు, అక్కిరాజు దుర్గాప్రసాద్, దేవులపల్లి శేషగిరిరావు నివాళి అర్పించి తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు పోచంపల్లి రమణారావు మాట్లాడుతూ తన కుడి భుజాన్ని కోల్పోయానని, భవిష్యత్తు భయంకరంగా కనిపిస్తుందని అన్నారు. ఎంతోమంది పేద విద్యార్థులకు కాలేజీ ఫీజులకు సహకారం అందజేసి వారిని ఉన్నత స్థితికి తెస్తున్న నేపథ్యంలో మంత్రి సునీల్ తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి సైన్యాన్ని వదిలి వెళ్ళడం బాధాకరమని అన్నారు. మృతుడి సోదరుడు అమెరికాలో ఉన్న నేపథ్యంలో నేడు మంగళవారం అంబర్ పేట స్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించడం జరుగుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ నాయకులంతా ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరారు.

## అక్రమ మైనింగ్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**



మెట్‌పల్లి కమ్మర్‌పల్లి జాతీయ రహదారిపై మేడిపల్లి గ్రామ శివారులో రాత్రింబవళ్లు అక్రమంగా మట్టి తరలిస్తూ కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కొందరు లూటీ చేస్తున్న విషయాన్నీ జగిత్యాల జిల్లా కలెక్టర్‌ని కలిసి పిర్యాదు చేసిన కోరుట్ల ఎమ్మెల్యే డా.సంజయ్ తక్షణమే మైనింగ్ ఆపి ప్రజల సంపదను కాపాడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాంగ్రెస్ అంటేనే అక్రమార్కులు కేర్ ఆఫ్ అని ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తే కాంగ్రెస్ నాయకులకు లాభం.. బీఆర్ఎస్ గెలుస్తే ప్రజలకు లాభమని ముందే చెప్పం అని గుర్తుచేశారు.




## కాకతీయ టయోటా షోరూం ప్రారంభించిన ఎస్పీ

**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి:**

సూర్యాపేట పట్టణంలోని జాతీయ రహదారి ప్రక్కన మాంగల్య షాపింగ్ మాల్ ఎదురుగా విద్యానగర్ నందు నూతన కాకతీయ టయోటా షోరూంను జిల్లా ఎస్పీ కే.నరసింహ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టయోటా కంపెనీ వారు నూతన టెక్నాలజీతో రకరకాల కార్లను తయారుచేసి సూర్యాపేట జిల్లా ప్రజలకు ఈ షోరూం ద్వారా పేద మధ్యతరగతి వారికి అతి తక్కువ ధరలకు అందించాలని దృక్పథంతో జిల్లా కేంద్రంలో షోరూం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ప్రజలు వారికి నచ్చిన కార్లను కొనుగోలు చేసి టెక్నాలజీకి అనుకూలంగా కార్లను వినియోగించుకోవాలని తెలియ జేశారు. ఏ కారునైనా వివిధ ఫైనాన్స్ సంస్థల ద్వారా ఈఎమ్ఐ పద్ధతిలో కొనుగోలు చేసుకోవచ్చున్నారు. షోరూం సిబ్బంది, కస్టమర్లు, వివిధ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## దీప్తికి డాక్టరేట్ ప్రదానం



**వేద న్యూస్, వరంగల్ :**

"అడెనిన్-ప్రేరిత దీర్ఘకాలిక కిడ్నీ నష్టం, కార్డియో వాస్కులర్ ఆల్టరేషన్స్-టార్గెటింగ్ టీజిఎఫ్ - బి1, కాస్పేస్ 3 వ్యతిరేకంగా ఎంచుకున్న సహజ సమ్మేళనాల రక్షణ ప్రభావాల మూల్యాంకనం" అనే థీసిస్‌పై బాహ్య పరీక్షకులు, వివా-వోస్ కమిటీ సిఫార్సుల ఆధారంగా గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ నుండి విశాఖపట్నం గీతం యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్ ఆర్ దీప్తి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ డిగ్రీ అవార్డుకు అర్హత సాధించారు. ఇటీవల విశాఖలోని గీతం విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఈ ప్రకటన చేశారు. ఆమె "అడెనిన్-ప్రేరిత దీర్ఘకాలిక కిడ్నీ నష్టం, కార్డియోవాస్కులర్ ఆల్టరేషన్స్-టార్గెటింగ్ టీజిఎఫ్-బి1, మరియు కాస్పేస్3 వ్యతిరేకంగా ఎంచుకున్న సహజ సమ్మేళనాల రక్షణ ప్రభావాల మూల్యాంకనం" అనే శీర్షికతో తన పిహెచ్‌డి థీసిస్‌ను సమర్పించారు. గీతం విశ్వవిద్యాలయంలోని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో ఫార్మకాలజీలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి సుహాసిని పర్యవేక్షణలో ఆమె తన పరిశోధన చేసింది. వరంగల్ నుండి వచ్చిన దీప్తి రాయల్లా ప్రస్తుతం ఓగ్లాపూర్ హనుమకొండ జిల్లాలోని కేర్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

# సుందరయ్య జీవితం స్ఫూర్తిదాయకం

**వేద న్యూస్, మోతె :**




ఆదర్శనేత, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు జీవితాంతం పీడిత ప్రజల కోసం పోరాడిన ఆదర్శ నేత సమాజ గమనాన్ని నిరంతరం అధ్యయనం చేసి ప్రజలలో పోరాట పటిమను పెంచిన అధ్యయన శీలీ కామ్రేడ్ సుందరయ్య అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టి పెళ్లి సైదులు అన్నారు. సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య 40 వ వర్ధంతి సందర్భంగా సిపిఎం పార్టీ మోతే మండల కమిటీ ఆధ్వర్యంలో మోతే మండల పరిధిలోని విబలాపురం, సిరికొండ, మోతే, బుర్కచర్ల, రాఘవాపురం గ్రామాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్రోద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించడమే కాకుండా వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నిజాం నవాబులకు వ్యతిరేకంగా పోరాడి 10 లక్షల ఎకరాల భూములను పేద ప్రజలకు పంపిణీ చేసిన యోధుడు సుందరయ్య అని కొనియాడారు. పీడిత ప్రజల కోసం తన ఆస్తులు భూములను దానం చేసి సమాజం కోసం పిల్లల్ని కూడా వద్దనుకున్న ఆదర్శనేత పుచ్చలపల్లి సుందరయ్య అన్నారు. చట్టబద్ధ పదవులను అనుభవించినప్పటికీ ఆడంబరాలకు పోకుండా సైకిల్ పైనే పార్లమెంటుకు వెళ్లి పేద ప్రజల సమస్యలను చట్ట సభలలో చర్చించిన మహోన్నత నేత సుందరయ్య అని అన్నారు. చట్ట సభలలో వ్యక్తులపై వ్యక్తిగత విమర్శలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న విధానాల ప్రాతిపదికగా అర్థవంతమైన రీతిలో ప్రజా సమస్యలను చర్చించి పార్లమెంటును ప్రజా సమస్యల చర్చా వేదికగా నిలిపారన్నారు. అగ్రకులంలో పుట్టినప్పటికీ వివక్షకు అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడి దళిత చేత ఆలయ ప్రవేశాలు చేయించి, సహపంక్తి భోజనాలు నిర్వహించిన ఆదర్శ నేత సుందరయ్య అని కొనియాడారు. సమాజంలో వస్తున్న మార్పులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న చట్టాలను అధ్యయనం చేసి ప్రజలను పోరాటాల్లోకి తీసుకువచ్చి వారిని చైతన్యం చేశారని అన్నారు. నీటి వనరులను వినియోగం, భూమిపై ఉన్న సహజ వనరులు ప్రజలందరివని సంపద వికేంద్రీకరణ జరగాలని దున్నేవాడికే భూమి ఇవ్వాలని ప్రజల కోసం భూ పోరాటాలు చేసిన మహోన్నత నేత సుందరయ్య స్ఫూర్తితో ఆర్థిక, సామాజిక, రాజకీయ అసమానతలు లేని సమాజం కోసం చేసే పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ములుకూరి గోపాల్ రెడ్డి, మండల కమిటీ సభ్యులు కక్కిరేణి సత్యనారాయణ, కాంపాటి శ్రీను, నాగం మల్లయ్య, బూడిద లింగయ్య, దోసపాటి శ్రీనివాస్, కిన్నెర పోతయ్య, చర్లపల్లి మల్లయ్య,గుంట గాని యేసు, జంపాల స్వరాజ్యం,ముల్కూరి మణెమ్మ, నాగం వినోద, షేక్ మొగలాల్, మిడిదొడ్డి శ్రీరాములు, శ్రీకాంత్, ఎడమ పద్మ, ఎరుకల యాదమ్మ, తురుక నాగమ్మ, బోడపట్ల హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు ఇంకెన్నడు నిర్వహిస్తారు..?

### బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



రాష్ట్ర ప్రభుత్వం ఉభయ సభలలో బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల్లో విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్స్ కల్పిస్తూ బిల్లులు ఆమోదించి రాష్ట్ర గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపినా కేంద్రంలో ఎలాంటి స్పందన లేకపోవడం బీసీల ఎడల కేంద్ర ప్రభుత్వానికి ఉన్న చిత్త శుద్ధి ఏమిటో అర్థమవుతుందని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు నేడొక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామపంచాయతీలలో, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లలో, మున్సిపాలిటీలలో ఎన్నికలు జరగక ఎన్నికైన ప్రజాప్రతినిధులు లేక అభివృద్ధి పనులు కుంటు పడుతున్నాయన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ లో బీసీలకు స్థానిక సంస్థల్లో42 శాతం రిజర్వేషన్లు పెంచి ఎన్నికలు నిర్వహిస్తామని వాగ్దానం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉభయ సభలలో బిల్లు ఆమోదించి కేంద్రా నికి పంపి చేతులు దులుపుకుంటే సరిపోతుందా అని ఆయన ప్రశ్నించారు. స్థానికసంస్థల్లోబీసీలకు రిజర్వేషన్ బిల్లు కేంద్రం ఆమోదించే విధంగా ఒత్తిడి తేవడానికి రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలతో, బీసీ సంఘాల ప్రతినిధులతో కూడిన అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్తామని చేసిన వాగ్దానాన్ని ముఖ్యమంత్రి తక్షణమే ఆచరణలో పెట్టాలన్నారు. రాష్ట్రంలోని ఇద్దరు కేంద్ర మంత్రులు బిజెపి ఎంపీలు ప్రధానమంత్రి పై ఒత్తిడి పెంచిస్థానిక సంస్థల్లోబీసీలకు రిజర్వేషన్ బిల్లు 9వ షెడ్యూల్లో చేర్చే విధంగా చిత్త శుద్ధితో కృషి చేయాలని లేనిచో బీసీల ఆగ్రహానికి గురి కావలసి వస్తుందని హెచ్చరించారు. బీసీలకు రిజర్వేషన్ పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు.

# ప్రజావాణిలో 63 దరఖాస్తులు

**వేద న్యూస్, సూర్యాపేట ప్రత్యేక ప్రతినిధి :**




ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తు క్షుణ్ణంగా పరిశీలించి ఖచ్చితమైన సమాధానం ఆర్జిదారులకి తెలపాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి లో జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబుతో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులపై అధికారులు ఒక కార్యాచరణ రూపొందించుకొని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వివి అప్పారావు,డిఐ ఈఓ భాను నాయక్, డిఈఓ ఆశోక్,డియంహెచ్ఓ కోటాచలం, సిపిఓ కిషన్, సంక్షేమ అధికారులు శంకర్, దయానంద రాణి,శ్రీనివాస్ నాయక్, జగదీశ్వర్ రెడ్డి, పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, సుపారీటిడెంట్లు సాయి గౌడ్, శ్రీలత రెడ్డి, వినోద్ కుమార్,అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అస్తవ్యస్తంగా డ్రైనేజీ కాలువ

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**



మిర్యాలగూడ పట్టణంలో గత కొన్ని సంవత్సరాలుగా చెట్లు,చెత్తతో పేరుకు పోయిన ప్రధాన డ్రైనేజ్ కాలువను జెసిబిలతో దగ్గర ఉండి శుభ్రం చేయించిన మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణంలో డ్రైనేజ్ నీరు ప్రవహించే ప్రధాన కాలువ కొన్ని సంవత్సరాలుగా చెట్లు చెత్త చెదారంతో పేరుకొని పోవడంతో పట్టణంలో కాలువలు,డ్రైనేజ్ వ్యవస్థ మొత్తం బ్లాక్ అయిపోయాయి అని విచారం వ్యక్తం చేశారు. గతంలో ప్రతీ సంవత్సరం కొన్ని లక్షల రూపాల నిధులు డ్రైనేజ్ క్లీనింగ్ కోసమని ఖర్చు చేస్తున్నట్టు బడ్జెట్ లో ఉన్నా కూడా ఎక్కడి చెత్త అక్కడే ఉండటం చూసి ఆశ్చర్యం కలిగింది అన్నారు. లక్షల రూపాల నిధులు ఎటుపోయాయి అనేది అర్థం కావడం లేదు అని, అందుకే మున్సిపల్ ధనాన్ని వృథా కాకుండా మున్సిపల్ జెసిబి లు మున్సిపల్ కార్మికులతో కాలువలను శుభ్రం చేయిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్,శానిటరీ ఇన్స్పెక్టర్,మున్సిపల్ కార్మికులతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ముందుగానే మూడు నెలల బియ్యం..!

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**



కేంద్ర ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు శుభవార్త చెప్పింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వాలకు మూడు నెలల బియ్యం అందించాలని ఉత్తర్వులు జారీ చేసింది. పేదలకు రేషన్ దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ జూన్ నెల మాసంలో ఒకేసారి మూడు నెలల కోటా అందించనున్నారు. జూన్, జూలై, ఆగస్టు నెలల బియ్యం ముందుగానే లబ్ధిదారులకు అందించాలని నిర్ణయించింది. మూడు నెలల బియ్యం ఒకేసారి రేషన్ షాపులకు తరలింపు ప్రక్రియ వేగవంతం చేయాలని కోరింది. ఈ నెల ఆఖరి కల్లా రేషన్ షాపులకు ఎంఎల్ ఎస్ పాయింట్లు నుండి తరలించాలని పేర్కొంది. కాగా నల్గొండ జిల్లాలో 991 రేషన్ షాపులకు గాను 4,81,669 రేషన్ కార్డుదారులకు మోక్షం కలగనుంది. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తుండగా ఎన్ని మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం ఉందని సంబంధించిన అధికారులు లెక్కలు తీస్తున్నారు. లబ్ధిదారులకు ఒకేసారి మూడు నెలల బియ్యాన్ని ఎలా పంపిణీ చేయాలని సంబంధించిన అధికారులు చర్చించుకుంటున్నారని విశ్వసనీయ సమాచారం ద్వారా తెలుస్తుంది. మూడు నెలల బియ్యాన్ని ముందస్తుగా రేషన్ షాపులలో తరలించాలంటే ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది.


## తనిఖీల జాడేది..?

మొదటి పేజీ తరువాయి

అనుమతులు ఇచ్చి ఇటు జిల్లా వైద్యశాఖ, మరోవైపు మెడికల్ కౌన్సిల్ తనిఖీలు చేయకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో 'ఆడిందే ఆట పాడిందే పాట' తీరుగా సాగుతోంది. 'బంధన్' ఆస్పత్రిలో ఇటీవల ఓ రోగి మృతి చెందగా, సదరు ఆస్పత్రిలో వైద్యం అందించిన వైద్యులు ఎంబీబీఎస్, పల్మనాలజిస్ట్ కాదని, బీఏఎంఎస్, ఫాం-డీ వారని మృతుడి కుటుంబీకులు ఆరోపించారు. ఆస్పత్రిలో జరిగిన ఘటనపై డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో విచారణ ఇంకా కొనసా.. గుతుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సదరు హాస్పిటల్ వైద్యుల అర్హత, అనుభవంపై నిగ్గు తేల్చాల్సి ఉండగా, తాత్సారం చేస్తుండటంతో 'పాలు-నీళ్ల'లా వాళ్లు.. వీళ్లు అని తేడా లేకుండా అందరూ కలిసే.. ఇలా దోపిడీ చేస్తున్నారా? అనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి.

### బడా ఆస్పత్రులపై దాడులు చేయరా?

తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ప్రైవేట్ ఆసుపత్రులపై దాడులు చేయడంలో వెనకడుగు వేస్తోంది. ఫిర్యాదులొస్తే కానీ చర్యలు తీసుకోవడం లేదు. ఒక వేళ కంప్లయింట్ వచ్చినా యాక్షన్ తీసుకోవడానికి మాత్రం ఎందుకో జాప్యం వహిస్తోంది. గతంలో బంధన్ ఆస్పత్రిలో తనకు జరిగిన అన్యాయంపై ఓ జర్నలిస్టు ఆధారాలతో సహా జిల్లా, రాష్ట్ర స్థాయి యంత్రాంగంతో పాటు మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేశారు. అయినా ఎలాంటి ఎంక్వయిరీ అయితే జరిగినట్టు లేదు. ఇటీవల సదరు ఆస్పత్రిలోనే నిండు ప్రాణం పోయింది. సదరు ఆస్పత్రిలో వైద్యులు రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని బాధితులు ఆరోపిస్తుండగా, ఆరోజు జరిగిన ఘటనపై ఎంక్వయిరీ ఎక్కడికొచ్చిందో మరి.. అదే విధంగా ప్రైవేటు, కార్పొరేటు పెద్దాస్పత్రుల్లో పని చేసే అర్హత లేని (నకిలీ)వైద్యుల అంతు చూడటానికి మెడికల్ కౌన్సిల్ వెనకడుగు వేయడానికి.. అమ్యామ్యాలే కారణమనేది ఆరోపణలు మాత్రమే అని తేలాలంటే.. చిన్న, చిన్న క్లినిక్‌లు మాత్రమే కాకుండా అన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో మెడికల్ కౌన్సిల్ దాడులు చేయాల్సిందేనని నగరవాసులు అభిప్రాయపడుతున్నారు.



## తహసిల్దార్‌కు సీపీఐ ఘన స్వాగతం

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

వేములపల్లి మండల కేంద్రానికి నూతన తహసిల్దార్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన హేమలతను సిపిఐ మండల కార్యదర్శి జిల్లా యాదగిరి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలు అందేట్లు చేయాలని, మా పార్టీ తరఫునుంచి ఎల్లవేళలా వారికి సహాయ, సహకారాలు అందిస్తామని తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు జడ భీమయ్య,బస్కా పరమేష్, పుట్టల కృష్ణ,మాతంగి సత్యం, దాసరి లింగయ్య,జిల్లా ఆనందం తదితరులు ఉన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073